క్లుప్తంగా

యువతి అదృశ్యం

మహాముత్తారం : మండలంలోని ములుగుపల్లి గ్రామానికి చెందిన యువతి చిర్ర ఐశ్వర్య ఈ నెల 20న టైలరింగ్ పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లేదు. కాగా యువతి తల్లి చిర్ర శోభ బుధవారం మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మహేందర్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

టేకుమట్ల : మండలంలోని దుబ్యాల గ్రామంలో మదునం పోశమ్మ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భూ దాతలు బిక్కినేని కవిత–రాజేశ్వర్‌రావు, పద్మ–సంపత్‌రావు, చంద్రకళ–మనోజ్‌రావులతో పాటు, విగ్రహ దాత పాల్సాని స్వప్న–కిరణ్‌రావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, ఎంపీటీసీ బిక్కినేని అనితాసంపత్‌రావు, మాజీ సర్పంచ్ బిల్లకంటి ఉమేందర్‌రావు, పోలుదాసరి రాజేశం, రామస్వామి, నాగుల వసంతసంపత్, గుండబోయిన మొగిళి, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి



టేకుమట్ల : మండల కేంద్రంలో ఆధార్ నమోదు సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్ అన్నారు. ఈ మేరకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడం వల్ల స్థానికులు చిట్యాల, మొగుళ్లపల్లి మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు.

వనభోజనాల సందడి



ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామస్తులు బుధవారం వనభోజనాలకు తరలి వెళ్లారు. వ్యవసాయ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు, రైతులు కుటుంబ సమేతంగా అడవిలో వనభోజనాలకు వెళ్లి ప్రకృతి దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలకు కూడా పూజలు నిర్వహించారు. వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు అరగించారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన గన్నెబోయిన రాజేశ్ గుండె పోటుతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను మేడారం గౌడ సంఘం నాయకులు బుధవారం పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గౌడ సంఘం నాయకులు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. రాజేశ్ కుటుంబానికి గౌడ సంఘం అండగా ఉంటుందని తాడ్వాయి పీఏసీఎస్ చైర్మన్, గౌడ సంఘం నాయకుడు పులి సంపత్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బత్తిని రాజుగౌడ్, నాయకులు తాళ్లపల్లి చంద్రయ్య, పాల వీరస్వామి, సుభాష్, తాళ్లపల్లి అనిల్, లక్ష్మణ్, బండి యాదగిరి, కోట సురేష్, గట్టు శ్రీను, తిర్రి సమ్మయ్య, జనగం రవి, పబ్బ సమ్మయ్య, గద్దం రాములు, జనగాం నవీన్, తడూరి చంద్రయ్య, చంగల సాంబరాజు, పరుశురాములు, ముక్కెర శోభరాజు ఉన్నారు.

మొగుళ్లపల్లిలో..



మొగుళ్లపల్లి : మండలంలోని మేదరమెట్ల, బంగ్లాపల్లి, వేములపల్లి గ్రామాలకు చెందిన కొమురయ్య, గోనెల వర్షిత, అనుముల మోహన్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

● సీఐ బండారి కుమార్



వెంకటాపురం(కె): విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ బండారి కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, అధికారులు

వెంకటాపురం(కె) : మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత బానిస కావొద్దని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వ్యతిరేక పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ బండారి కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావద్దన్నారు. వాటికి బానిసలుగా బారి తమ జీవితాలను పాడు చేసుకోవద్దని కోరారు.

అవగాహన ర్యాలీ

మండల పరిధిలోని చొక్కాల గ్రామంలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (యాంటి డ్రగ్స్ డే) సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం సిబ్బందితో వైద్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

వాజేడు : విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సూచించారు. ఈ మేరకు బుధవారం వాజేడు, ధర్మవరం ఉన్నత పాఠశాలలతో పాటు పేరూరు ఆశ్రమ పాఠశాలలో విడివిడిగా అవగాహన సమావేశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను, అనర్థాలను వివరించారు. అలాగే సైబర్ నేరాలు, మోసాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల బారిన పడొద్దని తెలిపారు. విద్యార్థి దశలోనే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టేకుమట్ల : విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వెలిశాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకాల మత్తు పదార్థాలతో యువత పెడదారి పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో వ్యక్తి మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేలా చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దాని వల్ల మానసిక ఎదుగుదల పూర్తిగా లోపించి వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధురిమ, ఉపాధ్యాయులు మియాపురం జగన్నాథం, ముత్యం, అశోక్, సీతారామారావు, సునీల్, నరేష్, శోభ, సుమత, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, సతీష్, ఏఎన్ఎం సంగీత, చిత్ర, తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న వాజేడు ఎస్సై హరీశ్



మాట్లాడుతున్న పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్, పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అవగాహన సదస్సు..

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) పాఠశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సం సందర్భంగా డాక్టర్ రేష్మ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేష్మ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు , వైస్ ప్రిన్సిపాల్ పాపారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

రేగొండ(కొత్తపల్లిగోరి) : మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందని జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వంటేరు చంద్రశేఖర్ రావు అన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామ కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సమాజానికి సవాల్‌గా మారిన మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తోందన్నారు. చదువుకోవాల్సిన సమయంలో మత్తుకు అలవాటు పడి బానిసలవుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం వారితో సమయం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తంగళ్లపల్లి కుమారస్వామి, రాజేందర్, చక్రధర్ రావు, మహేందర్, శ్రీధర్, కల్పన కుమారి, కోటిలింగం, శ్రీనివాస్, మాధవి, రమాదేవి, ప్రతాప్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



టేకుమట్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రసాద్



మొగుళ్లపల్లి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రేష్మ



రేగొండ(కొత్తపల్లిగోరి): ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న ఎస్సై అభినవ్

కాటారం : మండలంలోని బొప్పారం ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురై గుంతలమయంగా మారింది. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు గమనించక రోడ్డు పక్కకు వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. దీంతో విషయం తెలుసుకున్న కాటారం ఎస్సై అభినవ్, పోలీస్ సిబ్బందితో కలిసి కోతకు గురైన రోడ్డును బుధవారం పరిశీలించారు. హుటాహుటిన పొక్లెయినర్‌తో కోతకు గురైన ప్రాంతాల్లో మట్టితో నింపి చదును చేయించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. కోతకు గురైన రోడ్డును మరమ్మతు చేయించిన ఎస్సై సేవలను పలువురు కొనియాడారు. ప్రమాదాలబారిన పడకుండా ఎస్సై తీసుకున్న చర్యలతో ద్విచక్ర వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ మరమ్మతు పనుల పరిశీలన



కాటారం : మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో కొనసాగుతున్న విద్యుత్ మరమ్మతు పనులను బుధవారం ట్రాన్స్‌కో భూపాలపల్లి డీఈఈ నాగరాజు పరిశీలించారు. పనులు కొనసాగుతున్న తీరుపై ఆయన ఆరా తీశారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ సరఫరాలో పదే పదే అంతరాయం ఏర్పడకుండా మరమ్మతు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించి లూజ్ వైర్లను సరిచేయాలని సూచించారు. కాటారం డీఈఈ నాగరాజు, ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నారు.

సన్మానం

ములుగు రూరల్ : ములుగు సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావును బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న సన్మానించారు. ఈ మేరకు బుధవారం ఎస్సై, సీఐను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. నాయకులు వీరబోయిన రాజేందర్, గుండారపు రాజు, నాజర్ ఖాన్, నాగార్జున, రామల్, సతీష్, వినోద్, లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

‘సైబర్’ ఫిర్యాదుకు 1930 డయల్ చేయండి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం : ఏజెన్సీలో నివసిస్తున్న ప్రజలు సైబర్ నేరాల బారిన పడితే వెంటనే డయల్–1930కి సమాచారం ఇవ్వాలని సైబర్ వారియర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మహేందర్, రామారావు, హరి సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద బుధవారం ప్రధాన రోడ్డుపై సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఫోన్, మెయిల్స్, ఫేస్‌బుక్, ఇతర ఆన్‌లైన్‌లలో ఎవరైనా నగదు, ఇతర సమస్యల్లో చిక్కుకుంటే వెంటనే డయల్–1930కు లేదా సైబర్ క్రైమ్ సైట్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం వివరాలతో కూడిన ఫిర్యాదును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలన్నారు. ఏటీఎంల ఓటీపీలను ఎవరికి చెప్పొద్దన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలన్నారు.

నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య



కొమురయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి : మద్యం మత్తులో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని వేములపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. వేములపల్లి గ్రామానికి చెందిన పోచంపల్లి కొమురయ్య (56) తన కున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా కొమురయ్య మంగళవారం పిడిసిల్ల గ్రామంలో తన బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లాడు. అయితే అతిగా మద్యం తాగి కుటుంబ సభ్యులతో రాత్రంతా గొడవ పెట్టుకున్నాడని చెప్పారు. అర్ధరాత్రి సమయంలో టాటా ఎస్ వాహనం కోసం తీసుకు వచ్చిన డీజిల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు తెల్లవారుజామున చూసే సరికి కొమురయ్య ఇంటిఎదుట మృతి చెంది ఉన్నాడని తెలిపారు. మృతుడికి భార్య దేవేంద్ర, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘అటవీ అధికారిని వెంటనే తొలగించాలి’



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కన్నాయిగూడెం : మండలంలోని మల్కపల్లి గ్రామానికి చెందిన పెద్దం లక్ష్మయ్య మృతికి కారకుడైన అటవీ శాఖ అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో సీపీఎం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీన లక్ష్మయ్య మృతి చెందాడని, ఇందుకు కారణమైన అటవీ అధికారులను వెంటనే సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. గిరిజనేతరుడి భూమిని చదును చేసేందుకు కూలీకి వెళ్లిన వారిపై కేసు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన రాహిత్యంతో కేసు నమోదు చేసిన అటవీ సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నలుగురు కలిసి కూలీపనికి వెళ్తే భూయజమానుల పై కేసు నమోదు చేయకుండా కూలీలపై కేసు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. పోలీసుల బెదిరింపుతో భయందోళనకు గురైన లక్ష్మయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క చొరవ చూపాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎండీ. దావూద్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్, కన్నాయిగూడెం మండల కన్వీనర్ కావిరి సుధాకర్, భద్రయ్య, పవన్, రామరావు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలలు బంద్



పాఠశాల బంద్‌తో బయటకు వస్తున్న విద్యార్థులు

చిట్యాల : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను బుధవారం ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు వేల్పుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఉపాధ్యాయ నియమాకాలు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేస్తే ఊరుకోం

● జెడ్పీటీసీ గుడాల అరుణ

కాళేశ్వరం : రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మంథని నియోజకవర్గం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని మహాదేవపూర్ జెడ్పీటీసీ గుడాల అరుణ బుధవారం ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక మాఫియా వద్ద గతంలో ముడుపులు తీసుకున్నది ఆయా పార్టీల నాయకులే అన్నారు. మంథని నియోజకవర్గం అభివృద్ధిలో మంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి శ్రీధర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

ఘనంగా సాహు మహరాజ్ జయంతి



సాహు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

చిట్యాల : మండల కేంద్రంలో ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలను అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య హాజరై సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి, అవకాశాల కోసం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి పునాదులు వేసిన మొట్టమొదటి భారతదేశపు చక్రవర్తి, రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని అన్నారు. ప్రభుత్వపరంగా అందుతున్న అనేక సదుపాయాలు, హక్కులు 19వ శతాబ్దంలోనే కొల్హాపూర్ ప్రజలకు సాహు అందించారని తెలిపారు. 1894 ఏప్రిల్ 2న సింహాసనం అధిష్టించిన సాహు మహరాజ్ వెనుకబడిన కులాల వారికి పాఠశాలలు, వసతిగృహాలు ప్రారంభించి ఒక ఉద్యమంలా నడిపాడని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులలో వెనుబడిన కులాల వారందరికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్కొండ సురేష్, ఏవైఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్, ప్రదీప్, రాజమౌళి, మహేందర్ పాల్గొన్నారు.

అడుగుకో.. మడుగు

● చినుకుపడితే రోడ్డంతా చిత్తడే
● అధ్వానంగా మద్దులపల్లి క్రాస్ టు కుంట్లం రోడ్డు



వర్షపు నీటితో నిండిన గుంతలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్రాస్ రోడ్డు నుంచి పలుగుల పంచాయతీ కుంట్లం వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. చినుకు పడితే బురదమయంగా మారి ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో నానా అవస్థలు పడుతున్నారు. కనీసం విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ఏదైనా ఆపద వస్తే 108 వాహనం గ్రామాల్లో రాలేని పరిస్థితి దాపురించింది. రోడ్డుపై ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లకుండా రోడ్డంతా గుంతలమయంగా మారింది. మోకాలు లోతు గుంతల్లో ప్రయాణం చేయడానికి ఎవరూ సాహసం చేయడం లేదు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు గతంలో రూ.8 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపిన అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి



వాజేడు : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ సూచించారు. ఈ మేరకు మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 40 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. అందులో ఇద్దరికి జ్వరాలు ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా రాహిల్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యశాలకు రావాలని తెలిపారు. ఈ వైద్యశిబిరలో సంగీతా రాణి, తిరుపతి, శ్రీను, ఆశ వర్కర్లు ఉన్నారు.